క్లుప్తంగా

ఘనంగా కట్లమ్మ తీర్థం



పందలపాకలో కట్లమ్మ ఆలయం వద్ద బూరి, పానకం పంపిణీ చేస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాకలో కొలువైన కట్లమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గొర్రిపోటి వెంకటరమణ, అరుణ దంపతులు, బూరెలు, పానకం, బందారు అప్పారావు, సత్యవతి దంపతులు పులిహోర భక్తులకు పంపిణీ చేశారు. ఆడపడుచుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన పాముల వెంకన్నను కొట్టిన పాముల స్వామిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పాముల స్వామి కొంత నగదు వెంకన్నకు ఇచ్చాడు. అయితే నీకు డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని వెంకన్న అనడంతో ఆగ్రహం చెందిన స్వామి పక్కనే కూల్‌డ్రింక్ సీసా తో తలపై కొట్టాడు. దీనితో వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

వైభవంగా గోవృషభ కల్యాణం



గోవృషభ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం లో సోమవారం గోవృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముత్యం వెంకట హరే రామకృష్ణ (శ్రీను), రఘుదుర్గ దంపతులతో వేదపండితుల ఆధ్వర్యంలో వృషభరాజును నారాయణ స్వరూపుడిగా, గోవును లక్ష్మీ స్వరూపిణిగా భావించి ఈ కార్యక్రమం జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించారు. అలాగే కామ్యవృషోత్సర్జనం (అచ్చు వేసిన ఆంబోతును వదలడం) కూడా చేశారు.

అందుబాటులోకి వెబ్‌సైట్

సీతానగరం: కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సర్వీస్ వెరిఫికేషన్‌లో భాగంగా రేషన్ కార్డుదారుల నుంచి ఈకేవైసీ చేయడానికి ఆయా గ్రామాల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా కానిస్టేబుల్, వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వోలకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. పైన తెలిపిన అధికారులందరూ ఈకేవైసీ చేయించుటకు అర్హులన్నారు. కొత్త రేషన్ కార్డులు కావాల్సిన ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

సమస్యలపై నాలుగు అర్జీలు



అర్జీ అందుకుంటున్న ఎంపీడీవో భారతి

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందాయి. ప్రజల నుంచి ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ (సీఎమ్), కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

పెదపూడి: ప్రాచీన చరిత్ర గల పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవారికి లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మాళ్లపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో 15 మంది రుత్వికులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

వేసవి దుక్కులు.. పంటకు ఎంతో మేలు

- భూసారం వృద్ధికి దోహదం
- మట్టిలోని క్రిమికీటకాలు నశించి తెగుళ్ల దాడి తగ్గుముఖం
- లోతు దుక్కితో ఎక్కువ ప్రయోజనం
- మెట్ట ప్రాంత పంటలకు మరింత ప్రయోజనకరం



ఖాళీగా ఉన్న పంట పొలంలో వేసవి దుక్కు చేస్తున్న రైతు

రంగంపేట: వేసవిలో పొలాలను ఖాళీగా వదిలేస్తే కలిసొచ్చేదేమీ ఉండదుగాని నష్టాలు మాత్రం ఉంటాయి. ఖరీఫ్ సీజన్ రాబోతోంది. ఈ సమయంలో ముందుగా పొలాల్లో వేసవి లోతు దుక్కులు చేపట్టడం వల్ల నేల కింది పొరలోని మట్టి పైకి రావడంతో ఎండ వేడికి అందులోని క్రిమికీటకాలు నశిస్తాయి. నేల గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఇది ఖరీఫ్‌లో సాగు చేసే పంటకు మేలు చేస్తుంది.

ముందస్తు ప్రణాళికతో లాభాలు

రైతులందరూ ఖరీఫ్‌లో ఏ పంట వేస్తే బాగుంటుంది. ఏ రకం విత్తనాలు వేయాలి. ఏయే ఎరువులు సిద్ధం చేసుకోవాలనే విషయాలు మే నెల చివరి వారంలోనే ఆలోచిస్తుంటారు. సాగు చేయబోయే పంటల కోసం ఇప్పటి నుంచే వనరులు సిద్ధం చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేసుకునే వీలుంటుంది. అయితే వీటన్నిటి కంటే ముందుగా ప్రస్తుతం వేసవిలో భూములు ఖాళీగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పొలాలను అలాగే వదిలేయకుండా కొన్ని యాజమాన్య పద్ధతులు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో రైతులు మంచి ఫలితాలను అందుకునే వీలుంటుంది. వీటిలో ఎండాకాలంలో భూములు ఖాళీగా ఉన్న సమయంలో లోతు దుక్కి చేయడం మంచి ఫలితాలను ఇస్తుంది.

లోతు దుక్కి చేయండిలా...

సాగు చేయబోయే పంట కోసం ఇప్పటి నుంచి సాధారణంగా కల్టివేటర్ (ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేల 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దిగి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా తేమ ఎక్కువగా పెరుగుతుంది. ఎక్కువ కాలం తేమ తగ్గకుండా ఉంటుంది. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండటం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకుపోతాయి. దాని వల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి పొలంలోనూ వేసవిలో దుక్కులు దున్నాలి. మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది.

లోతు దుక్కి వల్ల ఎన్నో లాభాలు

వేసవిలో ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వలన పంట పొలాలకు ఎంతో మేలు. ముఖ్యంగా మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో భూములకు ఈ లోతు దుక్కులు ఎంతగానో ఉపయోగపడతామని వ్యవసాయాధికారులు తెలిపారు. వాలుకు అడ్డంగా లోతు దుక్కి దున్నడం వల్ల నేలలో తేమకు రక్షణ ఉంటుందని దీనివల్ల భూమిలోని చీడపీడలను నివారించవచ్చని వారంటున్నారు. భూమి గుల్ల బారి వర్షపు నీరు సంవృద్ధిగా భూమిలోకి ఇంకి ఎక్కువ కాలం పంటలకు తేమను అందిస్తుంది. కలుపు నివారణకు దోహదపడుతుందని తెలిపారు. పంట కాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండ వేడికి చనిపోయి వచ్చే సీజన్‌లో పురుగుల కారణంగా వ్యాపించే తెగుళ్ల బెడద తప్పుతుంది. భూమి లోపలి పొరలు బయటపడటం వల్ల గాలి భూమి పొరల్లోకి వెళ్లి సారవంతంగా మారుతుంది.

పురుగులు ఆదిలోనే నశిస్తాయి



భూసారం అభివృద్ధి, తేమశాతం పెరుగుదలకు లోతు దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో ప్రత్తి సాగు చేసే భూమిని వేసవిలో దుక్కి దున్నడం వల్ల ప్రత్తి పంటకు మేలు కలగడంతోపాటు రైతులకు పెట్టుబడి తగ్గి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా పంటకు నష్టం కలిగించే ఎరుపు, గులాబీ రంగు పురుగులు, గుడ్లు ఆదిలోనే నశించి రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

– కె. శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎం జిలానీ

సీతానగరం: రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం జిలానీ అన్నారు. సీతానగరం స్త్రీశక్తి భవనంలో సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణ కుమారి అధ్యక్షతన సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వార్షిక రుణ జీవనోపాదుల ప్రణాళికలను మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ)గా మార్చడం, మొబైల్ బుక్ కీపింగ్ (ఎంబీకే 2.0) కోసం మండలంలోని 59 గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఇచ్చారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని ఇరువర్గాల ఘర్షణ ఘటనపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రరావు తెలిపారు. ఇలపల్లి గ్రామంలోని సోమవారం ఉపాధి హామీ పనుల వద్ద రెండు వర్గాల వారు ఘర్షణ పడినట్టు తెలిపారు. ఇరువర్గాల్లో పలువురు గాయపడ్డారని, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈస్సాకోటి వెంకటరమణ ఫిర్యాదుపై పొలినాటి సరోజితోపాటు ఆమె బంధువులు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. పోలినాటి సరోజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్సాకోటి వెంకటరమణతో పాటు మరో నలుగురుపై కేసు నమోదు చేశామన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు, మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేటి భీమేష్



అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాతున్న బీసీ నాయకులు భీమేష్ తదితరులు

అనపర్తి: కూటమి ప్రభుత్వంలో బీసీలకు, మహిళలకు రక్షణ కరువయ్యిందని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ కొండేటి భీమేష్ స్వామి అన్నారు. సోమవారం అనపర్తిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన బీసీ నాయకులతో కలసి మాట్లాడుతూ మాజీ మంత్రి విడదల రజనీ ప్రకాశం జిల్లా మానుకొండవారిపాలెంలో ఒక కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి తరిగి వస్తున్న క్రమంలో సీఐ సుబ్బనాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరు ప్రభుత్వ బీసీ, మహిళా వ్యతిరేక విధానానికి అద్దం పడుతుందన్నారు. మాజీ మంత్రి, మహిళ అనే కనీస మర్యాద లేకుండా నిబంధనలు ఉల్లంఘించి సీఐ అనుచితంగా వ్యాఖ్యానించడమే కాకుండా ఆమెను గెంటి వేసి అవమానించడం దారుణమని భీమేష్ అన్నారు. ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు యావత్ పోలీసు వ్యవస్థకే మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. ఇప్పటికైనా బీసీలు సంఘటితమై ప్రభుత్వ బీసీ వ్యతిరేక కార్యకలాపాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బండారు శ్రీనివాస్, తుమ్మా రాజేశ్వరి, సత్తిబాబు, బీసీ సెల్ నాయకులు చింతా రామారావు, చిట్టూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'అమ్మకు వందనం'



తల్లుల పాదాలకు పుష్పాలతో వందనం చేస్తున్న పిల్లలు

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బొబ్బిల్లంకలోని అంగన్‌వాడీ సెంటర్ -1లో అంగన్‌వాడీ వర్కర్ వింజుమూరి రాధారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కేంద్రంలోని పిల్లలు తమ తల్లులకు పుష్పాలతో పాదాభివందనం చేశారు.

ఆలయాల్లో సప్తాహ భజనలు నిర్వహించాలి



నాగేశ్వరరావు మాస్టారును సత్కరిస్తున్న భజన సంఘాల సభ్యులు

రంగంపేట: లోక సంక్షేమం కోసం ఊరూరా ఆలయాల్లో సప్తాహ భజనలు నిర్వహించాలని వేట్లపాలెం భజన గురువు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు కోరారు. రంగంపేటలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్థానిక దేవి బాల భక్త సంఘం భజన గురువు, విఘ్నేశ్వర భజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పోతుల వీరసుందరరావు (వీరన్న) ఆధ్వర్యంలో నిర్వహించిన పద సంకీర్తనచార్యుడు అన్నమాచార్య జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ దేవాలయాల్లో నిత్య పూజలతో పాటు, వారానికి ఒకరోజైనా భజనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీరన్న మాట్లాడుతూ ప్రతి దేవాలయానికి ఒక భజన మండలి ఉండే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాస్టారును ఘనంగా సత్కరించారు. అనంతరం రంగంపేట, చంద్రేడు, వడిశలేరు, వేట్లపాలెం గ్రామాల భజన సంఘాల సభ్యులు సామూహిక భజనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఆలయ కమిటీ చైర్మన్ పోతుల రామ్‌కుమార్, ఆలయ అర్చకుడు దేవరభట్ల శిరిడిసాయిశర్మ, విఘ్నేశ్వర భజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై. సూర్యచక్రం, కార్యదర్శి జి. శివబాబు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునర్నిర్మాణం



శరవేగంగా జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులు

కోరుకొండ: గ్రామంలో శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. వచ్చే నెలలో ఆలయాన్ని ప్రారంభించాలన్న లక్ష్యంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడు బదిరెడ్డి దొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఆలయాన్ని 1953లో గోకవరం మండలం ఇటికాయలపల్లికి చెందిన నాగదేవర మహాలక్ష్మమ్మ కుమార్తె ముప్పుపాటి దోసాలమ్మ నిర్మించారు. నేటికి సుమారు 72 ఏళ్లు పూర్తికావడంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడ ఏటా షష్టి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వాటికి బస్టాండ్ వర్తక సంఘం, భక్తుల సహకారం అందిస్తున్నారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం పసుపులేటి బాపిరాజు, సీత దంపతులు, వీరి కుమారులు చిరంజీవి, బుల్లియ్యానాయుడు ఈ ఆలయ నిర్మాణానికి రూ.10,116 విరాళం అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన పోలీసు అధికారి వావిలేటి పురుషోత్తమరాజు, నాగలక్ష్మి దంపతులు రూ.18,116 విలువైన ఆలయ శిఖర కలశాన్ని కమిటీకి అందజేశారు.

అభివృద్ధి పనులు అత్యవసరంగా చేపట్టాలి

బిక్కవోలు: ఐదు నీటి సంఘాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 45 అభివృద్ధి పనులను అత్యవసరంగా చేపట్టాలని రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు కోరారని జిల్లా నీటి సంఘం ఉపాధ్యక్షుడు, అనపర్తి నీటి పంపిణీ సంఘం చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బిక్కవోలు జలవనరుల శాఖ కార్యాలయం వద్ద నీటి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అనపర్తి నీటి పంపిణీ (డిస్ట్రిబ్యూటరీ) కమిటీ పరిధిలో ఐదు నీటి సంఘాలున్నాయి. కడియం, అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, జి.మేడపాడు నీటి సంఘాలున్నాయి. ఈ ఐదు నీటి సంఘాల పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నాయకులు కోరారని తెలిపారు. అనపర్తి-3 చానల్‌పై ఉన్న స్లూయిజ్ గేటు. అత్యవసరంగా నిర్మాణం, జేగురుపాడు వద్ద షట్టర్ల ఏర్పాటు, బలభద్రపురం వద్ద గున్నాల తూము, నంబరు తూములను వెంటనే నిర్మించాలని ఆయా సంఘ చైర్మన్లు తెలిపారన్నారు. అనేక చోట్ల కాలువ పూడుకుపోయిందని, దీని వల్ల శివారు భూములకు సాగు నీరు అందడం లేదన్నారు. సామర్లకోట కాలువ గట్టు పొడువునా ఆక్రమణలు సాగుతుంటే జలవనరులకు శాఖ పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని సుధాకర్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



మహాజన సభలో పాల్గొన్న నాయకులు

ధవళేశ్వరం: వివిధ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ధవళేశ్వరంలోని మచ్చ సూర్యనారాయణ ప్రాంగణంలో జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం మహాజన సభ జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ బలశాలి ఇందిరా, అరవాలమ్మ డిగ్రీ కళాశాల డైరెక్టర్ దాసరి సత్యానందం, ఆంధ్ర యూనివర్సిటీ మెంబర్ అరదాని ప్రభాకరరావు విచ్చేశారు. ఎంఎస్సీ హోమ్ జెనెటిక్స్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ సాధించిన సురేఖ అరవాలమ్మను, బీఎస్సీ ఆక్వా కల్చర్‌లో 97 శాతం మార్కులు సాధించిన ధర్మాడి సౌమ్యను, ఇంటర్‌లో 942 మార్కులు సాధించిన బి.జగతాని సాయిదుర్గను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. దాసరి సత్యానందం సభలో జగతాని సాయి దుర్గను ఉన్నత చదువులకు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చక్క తాతారావు, అప్పారావు, గౌరవాధ్యకుడు బలసాలి సత్యాగ్రహరాజు, అధ్యకుడు పొన్నమండ వీరకుమార్, కార్యదర్శి ఎర్రా శివకుమార్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ కామాడి సుబ్బరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మచ్చ చెల్లారావు, మల్లాడి గణేశ్వరరావు, అంగాని అప్పారావు, లంకే విష్ణువర్మ ,దాసరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీష్మతాపం.. రోడ్లు నిర్మానుష్యం

- దడ పుట్టిస్తున్న ఎండలు
- మధ్యాహ్నం అయితే రాకపోకలు బంద్
- ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్లు
- ఉక్కబోతతో ప్రజల ఉక్కిరిబిక్కిరి



రాజానగరంలో నిర్మానుష్యంగా జాతీయ రహదారి



సూర్యారావుపేటలో జన సంచారం లేని రోడ్డు

రాజానగరం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఆకాశంలో అడపాదడపా కారుమబ్బులు వేస్తున్నా, వాటి ప్రభావం పెద్దగా ఉండడం లేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు వస్తాయనే చల్లటి కబురుతో వాటి రాక కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత టాపులేపేలా ఉంటున్న పరిస్థితులలో జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. 38 డిగ్రీల పైబడుతున్న ఉష్ణోగ్రతలు చినుకులు పడితేగాని చల్లబడే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెల మొదటి వారంలో భారీగా వర్షం కురిసినా ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్న సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా తిరగని పరిస్థితులలో రాజానగరం, దివాన్ చెరువు, లాలా చెరువు కూడళ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

వడగాల్పులకు బలి కావొద్దు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులు తగిలే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగవద్దంటున్నారు. చెమట కారణంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు.

కూల్‌డ్రింక్‌లకు డిమాండ్

వేసవి ఎండల తీవ్రతకు కొబ్బరి బొండాలతో పాటు జ్యూస్, కూల్‌డ్రింక్‌లకు డిమాండ్ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో సైతం జ్యూసులు, కూల్‌డ్రింక్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగర వాతావరణం ఉన్న ప్రాంతాల కూడళ్లలో కొబ్బరి బొండాలు విక్రయాలు మంచి లాభాలను అందిస్తున్నాయి.

ఘనంగా అమ్మవారి తీర్థం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని గుబ్బలమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి జాతర, సోమవారం తీర్థం జరిగాయి. భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కబడులు చెల్లించుకున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కంబాలచెరువు: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం జనరల్ విభాగంలో ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలను 3,187 మందికి రాయాల్సి ఉండగా 3 వేల మంది హాజరయ్యారు. వొకేషనల్ కు సంబంధించి 222 మందికి 202 మంది రాశారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం, హిందీ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 298 మందికి 250 మంది హాజరయ్యారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం పరీక్షను 119 మందికి 105 మంది రాశారు. పరీక్ష కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు.

మనో వికాసానికి గ్రంథాలయాలు జ్ఞాన నేత్రాలు



రంగంపేట గ్రంథాలయంలో చిత్ర లేఖనం నేర్చుకుంటున్న విద్యార్థులు

రంగంపేట: మనో వికాసానికి గ్రంథాలయాలు జ్ఞాన నేత్రాలుగా దోహదపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎన్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులతో నీతి కథలు బోధించారు. కాంపిటేటివ్ విద్యార్థి టేకుమూడి శ్రీనివాస్ జనరల్ నాలెడ్జి అంశాలు వివరించారు. విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలకు వచ్చి మహనీయుల జీవిత చరిత్రలు చదివి వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని రామకోటేశ్వరరావు అన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు రైమ్స్, బాలల గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న విజయవాడలో ఉద్యోగుల కౌన్సిల్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆశలు, ఆకాంక్షల సాధన దిశగా విజయవాడలో జూన్ 5న నిర్వహించే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర 3వ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి ప్రసాద్ వర్మ మాట్లాడుతూ సంఘం 365 రోజుల నిరంతర కార్యాచరణ ద్వారా ఉద్యోగులతో మమేకమై పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 10 వేల మంది ప్రతినిధులు ఈ కౌన్సిల్‌లో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశాన్ని జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జీఎస్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగుల సమస్యలైన పీఆర్సీ కమిషన్ నియామకం, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల సాధన, బకాయిల చెల్లింపు వంటి వాటికి పరిష్కారం కనుగొనడానికి ఈ సమావేశం ఒక వేదిక కానుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు చాంబర్లీన్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకుడు శుభాకర్, అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ రామగురు రెడ్డి, జిల్లా నాయకులు ఎ.శ్రీనివాసరావు, జీఎస్ రమేష్, దినేష్, ద్విభాష్యం శ్రీనివాస్, జె.రాజారావు పాల్గొన్నారు.